# నాకు మీరు – మీకు నేను

నాకు మీరు, మీకు నేను. ఇదేదో ఈమధ్య వస్తున్న కొత్త తెలుగు సినిమా పేరులా వుందా? కాదు. ఇది జరిగిన కథ. జరుగుతున్న కథ.

దాదాపు పాతికేళ్ళ క్రితం. నేను మొట్టమొదటిసారిగా అమెరికా వచ్చినప్పుడు ఒకానొక ఆదివారం సాయంత్రం హ్యూస్టన్ ఇంటర్ కాంటినెంటల్ ఎయిర్ పోర్ట్‌లో దిగాను. ఊరికి దూరం కనుక అక్కడే బస్సెక్కి నటరాజన్ చెప్పిన చోట బస్ దిగాను. కొత్త దేశం. కొత్త పరిసరాలు. కొత్త మనుష్యులు. కొత్త సంస్కృతి. గాబరాగా లేదు కానీ, కొత్తగా వుంది. దూరంగా కనపడ్డాడు ఒక భారతీయుడు. అతనే నటరాజన్ అయివుంటుందని దగ్గరికి వెళ్ళి అడిగాను "నటరాజన్?" అని.

అతను తలవూపాడు. నన్ను పరిచయం చేసుకుని "మా బ్రదరిన్లా మీ బ్రదరూ మంచి స్నేహితులట. ఆయనే చెప్పారు మిమ్మల్ని కలవమని" అన్నాను.

కారెక్కి అతని ఇంటికి వెడుతున్నప్పుడు అన్నాను "బహుశా రెండు వారాలు వుంటానేమో మీ ఇంట్లో. ఈలోపల నా జాబ్ గురించి తెలుస్తుంది. అప్పుడు ఎపార్ట్‌మెంట్ తీసుకుని వెళ్ళిపోతాను... " అన్నాను.

అతను కారు డ్రైవ్ చేస్తుంటే, నేను మెత్తగా జారిపోతున్న రోడ్లనీ, ఆ రోడ్ల మీద వేగంగా పోతున్న కార్లని చూస్తున్నాను.

"మీరు ఇక్కడికి మంచి టైమ్‌లో రాలేదు.. ఉద్యోగాలు దొరకటం చాల కష్టంగా వుంది. అందులోనూ మీరు ఇండియాలో చక్కటి ఉద్యోగం వదులుకుని ఇక్కడికి రావటం అంత మంచి పని కాదనిపిస్తోంది నాకు" అన్నాడు నటరాజన్.

అతని మాటలు విని ఒక్కసారిగా బిత్తరపోయాను ఏమిటి ఇంత నెగెటివ్‌గా మాట్లాడుతున్నాడీ పెద్ద మనిషి అని. "నా మాట విని వెనక్కి వెళ్ళిపోండి..... ఇండియాలోనే బెటర్ మీకు... " అన్నాడు మళ్ళీ.

నేను మాట్లాడలేదు. అదిరిపోయి ఆలోచిస్తూ కూర్చున్నాను. ఆయన చెబుతున్నది నిజమేనా అని కూడా ఆలోచిస్తున్నాను.

ఆ రోజు రాత్రి భోజనం అవగానే టెలిఫోన్ డైరెక్టరీ పట్టుకుని, రావూ, రెడ్డీ, మూర్తులూ కోసం వెతికాను. కొన్ని తెలిసిన ఇంటి పేర్లు కూడా వున్నాయేమోనని వెలకగా వెతకగా, నాకు కావలసిన ఇంటి పేరు కనపడింది. గోపాలరావు, సరస్వతి అన్న పేర్లు కనపడగానే, ప్రాణం లేచి వచ్చినట్టయింది.

వెంటనే ఆ నెంబర్‌కి ఫోన్ చేశాను. సరస్వతిగారే ఫోన్ అందుకుని "హలో ఎవరూ" అన్నది తెలుగులో.

చెప్పాను ఫలానా శ్యామలకి మొగుడ్ని, ఆ శ్యామల మీకు చుట్టం అని.

"మీరా. బాగున్నారా? శ్యామల ఎలా వుంది. దాన్ని చూసి పదిహేనేళ్ళయినా అయివుంటుంది ఎలావుంది. ఎక్కడ వుంది. అసలింతకీ మీరెక్కడ వున్నారు... " అంటూ ఆవిడ ప్రశ్నల వర్షం కురిపించింది.

ఆవిడ ఒక్కొక్క ప్రశ్న అడుగుతుంటే ఎండాకాలం మండుటెండలో చల్లటి వానజల్లు పడుతున్నంత హాయిగావుంది. అన్నిటికీ జవాబులు చెప్పాను. శ్యామల కెనడాలో మా బ్రదర్‌ఇల్లా దగ్గర వుందనీ, నేనొక్కడ్నే ఇంటర్వ్యూ కోసం వచ్చాననీ, అక్కడ జాబ్ వచ్చినా రాకపోయినా, హ్యూస్టన్‌లో వుండి నా ప్రయత్నాలు నేను చేద్దామనుకుంటున్నాననీ చెప్పాను.

"అయితే ఇప్పుడెక్కడున్నారు. మాఇంట్లోనే వుండండి జాబ్ వచ్చేదాకా. ఉండండి. రావుగారికిస్తాను. ఎక్కడికి రావాలో చెబితే ఆయన వచ్చి తీసుకు వస్తారు" అని ఆయనకి వెంటనే ఫోన్ కూడా అందించిందావిడ.

రావుగారు కూడా ఎంతో స్నేహపూరితంగా మాట్లాడి "సరిగ్గా ట్రై చేస్తే జాబ్ రాకపోదు. మా ఇంట్లోనే వుండండి. మా ఆవిడకి చుట్టాలంటే, మీరు గారెల బుట్టలో పడ్డారన్న మాటే.." అన్నాడాయన నవ్వుతూ.

మర్నాడే ఆయన నన్ను వాళ్ళింటికి తీసుకువెళ్ళటం, నా రెస్యూమేని ఒక పేజీలోకి కుదించటం, నాకు ఎంతో ధైర్యం చెప్పి పక్కనే నిలవటం, సరస్వతిగారే నన్ను ఇంటర్వ్యూలకి తీసుకు వెళ్ళటం. ఎంత తొందరగా నడిచాయంటే, మూడు వారాల్లో నాకు ఉద్యోగం కూడా వచ్చింది. రావుగారూ, సరస్వతిగారూ నాకు ఎపార్ట్‌మెంట్ వెతికిపెట్టి, కావలసిన సామాను కొనుక్కోవటంలో పక్కనే నిలిచి, అమెరికాలో నన్ను నా కాళ్ళ మీద నుంచోటానికి సహాయపడ్డారు. అది నన్ను ఎంతగా కదిలించిందంటే, నాకు రావుగారు ఆనాడు చేసిన సహాయం, నన్ను ఈ పాతికేళ్ళలోనూ కనీసం పదిహేను మందికి అలాటి సహాయమే చేయటానికి వెను కాడనీయలేదు. అప్పటినించీ ఇప్పటిదాకా ఒకటి అలవాటయింది. ఎవరైనా కొత్తగా వచ్చిన వాళ్ళకి చేతనైతే సహాయంచేయటం, చేయలేకపోతే చేసే వాళ్ళ దగ్గరికి పంపించటం. మాట్లాడేటప్పుడు నెగెటివ్ ఆలోచనలకి అవకాశం లేకుండా మాట్లాడటం. తలుచుకుంటే మనిషి చేయలేనిది లేదు. కొత్తగా వచ్చిన వాళ్ళకి సహాయం అందించేవాళ్ళల్లో ఎన్నిరకాల మనుష్యులున్నారో, ఆ సహాయం తీసుకునే వాళ్ళల్లో కూడా అంతగానో, అంతకన్నా ఎక్కువగానూ వ్యక్తిత్వాలు కనిపిస్తాయి.

పైన చెప్పిన కథలో నటరాజన్ ఒక పక్క, రావుగారు రెండవ పక్క. ఆ ఇద్దరికీ మధ్య చాల రకాల వాళ్ళు కనిపిస్తారు. అడిగితేనే సహాయం చేసేవాళ్ళు కొందరయితే, కొంతమంది అడగకపోయినా కలగజేసుకుని ఎంతో సహాయం చేస్తుంటారు. అంటే కావాలంటే వాళ్ళే అడుగుతారు కదా అని వూరుకునే మా బాల "శుభ్ర"మణ్యం ఒక ఉదాహరణ అయితే, కొత్తగా వచ్చిన వాళ్ళందర్నీ వాళ్ళింటికి కాఫీకి పిలిచి అందరికీ పరిచయం చేసి, ఏం కావాలన్నా అండగా నిలిచే నిర్మల అందరికీ తలలో నాలుకగా వుంటుంది. మేం హ్యూస్టన్‌నించీ ఆస్టిన్ వచ్చినప్పుడు కలిసిన మొదటిరోజే మమ్మల్ని ఆప్తుల లిస్ట్‌లో పెట్టేసుకుందావిడ.

అలాగే చదువుపూర్తిచేసుకుని ఉద్యోగప్రయత్నాల్లో మాఇంటికి వచ్చాడు సూరి. ఉద్యోగమొచ్చేదాకా మా ఇంట్లోనే వుండమంది మా ఆవిడ. ఉద్యోగ ప్రయత్నంలో నా సలహాలు అవసరమైన మేర తీసుకుని తన అన్వేషణ మొదలు పెట్టాడు

సూరి. నేను ఒకచోట ప్రయత్నం చేయమని సలహా ఇస్తే అతను దాని ఆధారంగా తీసుకుని పది చోట్ల ప్రయత్నం చేసేవాడు. నెల రోజుల్లో మా కంపెనీలోనే అతనికి ఉద్యోగం దొరికింది. అది మాకందరికీ సుఖాంతం. కానీ ప్రసాద్ తరహా వేరు. పది చోట్ల అవకాశాలు చూపిస్తే, ఏదో ఒకటి అదీ నేను పదిసార్లడిగితే అప్లై చేశేవాడు. ప్రొద్దున్నే ఆలస్యంగా లేపటం, పన్నెండు గంటలదాకా పేపర్లో న్యూస్ చదవటం, భోజనం కాగానే మళ్ళీ నిద్రపోవటం సాయంత్రం నేను ఆఫీసునించి వచ్చాక, ప్రయత్నాలు ఎలా వున్నాయి అని అడిగితే, ప్రపంచంలో ఆరాచకం ఎంతవుందో దాంట్లో అమెరికాలో ఇంకెంతవుందో చెప్పేవాడు. నెలాపదిహేను రోజులు మాఇంట్లో వున్నాడేమో అతని వ్యవహారంచూసి మొఖమాటం లేకుండా చెప్పేయాల్సివచ్చింది. ఇంకో నెలరోజులు అతనికి మాఇంట్లో భోజనం పెడితే నేనేమీ దివాళా తీయను కానీ అతనికి ఎంతో విలువైన సమయాన్ని ఎలా వృథా చేస్తున్నాడో చూపించటం కోసం ఒకరోజు చెప్పాను. అతనికి రెండే రెండు మార్గాలున్నాయని. ఒకటి గట్టిగా ఉద్యోగం కోసం ప్రయత్నం చేయటం. అలా చేస్తే మా ఇంట్లో ఎన్నాళ్ళున్నా మాకభ్యంతరం లేదని కూడా చెప్పాను. రెండది, తన ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళి తన ఇష్టమొచ్చిన పనిచేసుకోవటం. మాఇంట్లో మాత్రం వుండటానికి వీల్లేదనీ వారంరోజుల్లో బయటికి నడవాలనీ, చెప్పటానికి కొంచెం బాధ వేసినా, చెప్పాల్సి వచ్చింది.

అలాగే రామారావుగారు సురేష్ అని ఇండియాలో తన పాతమిత్రుడి తనయుడిని, ఇంట్లో అట్టే పెట్టుకుని అతనికి ఉద్యోగమొచ్చే దాకా సహాయం చేశారు. ఆయన ఆఫీసుకి ఒక గంట ముందుగానె బయల్దేరి సురేష్‌ని అతని ఆఫీసులో దించి, తను వెళ్ళేవారు. ఇలా నెలరోజులైనా చేశారేమో. తర్వాత అతను కారు కొనుక్కుంటానంటే, పదిహేను వందల డాలర్లు అప్పుగా ఇచ్చాడాయన. తర్వాత సురేష్ కాలిఫోర్నియాలో ఇంకో మంచి ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయాడు. అక్కడ రామారావుగారి మిత్రుడు కృష్ణమూర్తిగారింట్లో కొన్నాళ్ళున్నాడు. అది జరిగి ఇప్పటికి దాదాపు పదేళ్ళయినా, సురేష్ అప్పు తీసుకున్న డబ్బులు ఇవ్వకపోగా, ఫోన్ చేస్తే కనీసం ఫోన్ కూడా ఎత్తడు. రామారావుగారి రామాయణంలో ఇదో చిన్న పిడకల వేట.

కొన్నిచోట్ల తెలుగు అసోషియేషన్లలో, స్టూడెంట్ గెస్ట్ ప్రోగ్రాంలు కూడా వున్నాయి. గెస్ట్ కుటుంబాలు ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాలన్నా గ్రోసరీ తెచ్చుకోవాలన్నా కారు సహాయం, ఇంటి మీద ధ్యాస మళ్ళితే ఆ ధ్యాసని మళ్ళించటం, ఇంటికి పిలిచి తెలుగు భోజనం పెట్టటం మొదలైనవి చేస్తుంటారు. డెభ్భైలలో ఎనభైలలో తొంభై ఐదు దాకా కొత్తవాళ్ళకి మొదట్లో కష్టంగా వుండేది. ఇప్పుడు మనవాళ్ళు అమెరికా రావటం ఎక్కువయింది కనుక, సహాయం తీసుకునే వాళ్ళలాగానే, ఇచ్చే వాళ్ళ సంఖ్య పెరిగింది.

"కాకపోతే రిలే పరుగులా రావుగారు నాకు అందించింది, నేను సూరికి అందిస్తే, ఆ సూరి ఇంకొక భరతుడికి ఆ చేయి అందిస్తున్నాడు.

నాకు మీరు. మీకు నేను.

* * *